క్లుప్తంగా

పట్టణ సుందరీకరణకు చర్యలు


శివ సర్కిల్‌లో సర్వే చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ సుందరీకరణలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శివ సర్కిల్‌లో జంక్షన్ ఏర్పాటు చేసి సుందరీకరణ చేపట్టేందుకు బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఈ మేరకు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ గోపాలకృష్ణ, డీఈ నీరజ, సర్వేయర్ నాగేంద్రలతో కలిసి శివ సర్కిల్‌లో సర్వే చేశారు. అదేవిధంగా మాలకొండయ్య ఆస్పత్రి ఏరియాలో పారిశుద్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు హరీష్, సునీల్, మద్దిలేటి, బడేసాబ్, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెసలదిన్నె, గార్లదిన్నె గ్రామాల్లో పర్యటించి తాగునీరు, పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేడి చేసుకొని నీటిని తాగాలని సూచించారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న సంస్థ కార్యదర్శి ప్రకాష్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, గ్రంథాలయంలో వున్న పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థుల సంఖ్యను ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. పాఠకుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.

కౌతాళంలో హై ఓల్టేజ్

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని వడ్డె వీధిలో బుధవారం ఒక్కసారిగా హై ఓల్టేజ్ విద్యుత్ రావడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, లైట్లు పూర్తిగా కాలిపోయాయి. ఉదయం అందరు పొలాలకు, వివిధ పనులకు వెళ్లిన సమయంలో ఉన్నట్లుండి విద్యుత్ సరఫరాలో సమస్య వల్ల హై ఓల్టేజ్ వచ్చింది. సుమారు 20 ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు లైన్‌మ్యాన్ చిదనందకు వినతి పత్రాన్ని అందజేశారు. వడ్డెగురుస్వామి, వీరేష్, బుజ్జమ్మ, ఉసేని, నవీన్, హనుమక్క, లక్ష్మి ఉన్నారు.

సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: ఆదోనిలో ప్రభుత్వం ఉచితంగా సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. ఆదోని పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేశులు, వీరేష్, కృష్ణమూర్తి, వీరారెడ్డి, శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు.

మ్యాన్‌హోల్‌లకు మూతలు


మ్యాన్‌హోల్‌కు మూత వేస్తున్న కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై మ్యాన్‌హోల్‌లకు మూతలు లేక పట్టణ వాసులు ఇబ్బందులు పడేవారు. నిత్యం ఏదో ఒక వార్డు నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు 300ల మూతలను తెప్పించి సమస్యలున్న వార్డుల్లోని మ్యాన్‌హోల్‌లకు మూతలు బిగించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి బుధవారం తెలిపారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరురూరల్: ఎరువుల దుకాణాల్లో కాలం చెల్లిన పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ మహేశ్వరరెడ్డి బుధ వారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. స్థానిక శ్రీ మహలక్ష్మీట్రేడర్స్‌లో కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించినట్లు పారపల్లి గ్రామానికి చెందిన రైతు ఫక్రుద్దీన్ ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. రైతుకు విక్రయించిన మందులను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహమేదీ?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బహుమతులు
- ఈ ఏడాది ఇంతవరకూ ఆదిశగా చర్యలు తీసుకోని ప్రభుత్వం
- బహుమతులు ఇస్తుందో లేదో స్పష్టత కరువు


విద్యార్థులకు ప్రోత్సాహక అవార్డులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి (ఫైల్)

ఆదోని సెంట్రల్: ప్రతి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద పాఠశాలల రూపు రేఖలను మార్చివేసింది. అంతే కాకుండా ప్రభుత్వ బడులలో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరట నగదు ప్రోత్సాహక బహుమతులను అందించి సత్కరించింది. అయితే ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను ప్రొత్సహించడానికి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గత విద్యాసంవత్సరం (2023–24)లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు లేనట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వివిధ స్థాయిల్లో ప్రోత్సాహకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగు పరచి వారిని ప్రోత్సహించే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహక బహుమతులను అందించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిల వారీగా ఎంపిక చేసి నగదు బహుమతులను అందించారు. పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ వంటి గ్రూపుల వారీగా అత్యధిక మార్కులను సాధించిన వారిని ఎంపిక చేసి ప్రోత్సాహకాలను అందించారు. పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారికి రూ. లక్ష, రెండో స్థానానికి రూ.75వేలు, మూడో స్థానం సాధించిన వారికి రూ.50వేలు అందించారు. ఇంటర్మీడియెట్‌లో గ్రూపునకు ఒక్కరు చొప్పున ప్రతిభచాటిన వారికి రూ. లక్ష అందించారు. జిల్లా స్థాయిలో అయితే పదో తరగతిలో మొదటి స్థానం నిలిచిన వారికి రూ. 50వేలు, రెండోస్థానంలో రూ.30వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 15 వేలు ఇచ్చారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గ్రూపునకు ఒక్కరు చొప్పున ప్రతిభ చాటిన వారికి ఒక్కొక్కరికి రూ. 50 వేలు అందించి ప్రోత్సహించారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు రూ. 15వేలు ప్రోత్సాహకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించి, సత్కరించింది.

ఈ ఏడాది ప్రోత్సాహకాలు లేనట్టే!

ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ప్రొత్సాహకాలు అందించడానికి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయాలను తీసుకోవడం లేదు కనుక ప్రస్తుతం ప్రస్తుతం ప్రొత్సాహక బహుమతులు లేనట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతేడాదిలో ఆదోని నియోజకవర్గంలో జగనన్న ఆణిముత్యాల కింద పదో తరగతిలో ముగ్గురు, ఇంటర్మీడియెట్‌లో నలుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ ఏడాది జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో చదువుతున్న త్రివేణి విద్యార్థి పదోతరగతిలో 593, హరిప్రియ 591 మార్కులను సాధించి ప్రతిభ చాటారు.

పోటీతత్వం పెరుగుతుంది



ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి అవార్డులను అందజేయడం వలన విద్యార్థుల్లో కూడా పోటీ తత్వం పెరుగుతుంది. విద్యార్థులు అంతకంటే ఎక్కువ మార్కులను సాధించాలని పట్టుదలతో చదువుతారు. మనం అందించే చిన్న సహాయమే అయినా విద్యార్థులకు అది ఎంతో సంతృప్తి నిస్తుంది. ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులను అందించి ప్రోత్సహించడం ఎంతో మంచిది. – నాగేంద్రప్ప, హెచ్ఎం, ఎంపీయూపీ స్కూల్ శంకరబండ

ప్రోత్సాహక బహుమతులను అందించాలి



పదో తరగతి, ఇంటర్మీయెట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతును అందించాలి. గత ప్రభుత్వం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో సత్కరించింది. అందులో తమ కళాశాలకు చెందిన అమ్మాయి ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులను అందిస్తుందో లేదో తెలియదు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం ఎంతగానో ఉపయోగపడుతుంది.
– వి.సంజన్న, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆదోని

ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందిస్తే విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారికి మనోధైర్యం కల్పించిన వారవుతామని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని టౌన్: పట్టణంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని 8వ వార్డులో ఎన్‌జీవో కాలనీ సచివాలయం–02, 10వ వార్డులోని హవన్నపేట–01 సచివాలయం, 15వ వార్డులోని హవన్నపేట–03 సచివాలయం, 16వ వార్డులోని అంబేడ్కర్‌నగర్ సచివాలయం, 20వ వార్డులోని సాయిబాబానగర్ సచివాలయం, 27వ వార్డులోని పీఎన్‌రోడ్డు సచివాలయంలో ఉచిత ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనె 27వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు కొనసాగుతాయాన్నారు.

ఆధార్ క్యాంపు పరిశీలన

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఆధార్ క్యాంపును ఎంపీడీఓ కిరణమోహన్‌రావు పరిశీలించారు. మండలం కేంద్రం నందవరంతో పాటు నాగలదిన్నె, ముగతి గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేయండి

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలో ఐదు ప్రభుత్వ హైస్కూల్స్, జూనియర్ కాలేజీను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కోరారు. బుధవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభ సమయంలో మంత్రిని కలిసి నూతనంగా ఏర్పాటు చేయాల్సిన విద్యాలయాలకు సంబంధించిన నివేదికను సమర్పించారు.

ఆదోని అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కృషి చేయాలని, తనవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే విజ్ఞప్తులు చేస్తూ వినతి పత్రాలను అందజేస్తున్నారని, అయితే వినతులకే పరిమితం కాకుండా నిధులను విడుదల చేయించాలని కోరారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలో రోడ్ల ఏర్పాటు, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో గుంతలు పడి రోడ్లపై వరదనీరు నిల్వ ఉంటున్నాయని, తద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత బస్టాండు సర్కిల్, మర్చంట్స్ క్లబ్ ఏరియాలో రైల్వేబ్రిడ్జి ఏర్పాటుకు రైల్వే అధికారులతో చర్చించాలని, అందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లి ఆదోనిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు. మర్చంట్స్ క్లబ్ వద్ద చిన్నకల్వర్టు కావడం వల్ల వరదనీరు పూర్తిగా కాలువల్లోకి వెళ్లడంలేదని, ఆ కల్వర్టు స్థానంలో పెద్ద కల్వర్టు నిర్మించాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కల్వర్టు నిర్మాణానికి కృషి చేశామని, అయితే ఎన్నికల కోడ్ రావడంతో పూర్తి చేయలేకపోయామని చెప్పారు. పట్టణంలో రోడ్ల విస్తరణకు సహకారమందిస్తామని, అయితే రోడ్లపైన, రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి వారి ఉపాధిని కొల్లగొట్టడం మంచిదికాదని సూచించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, బైపాస్ రోడ్డు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

కూటమి ప్రభుత్వంలో హత్యలు

ఆదోనిలో హత్యా రాజకీయాలు ఇప్పటివరకు లేవని, కూటమి ప్రభుత్వ హయాంలోనే ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళను అగ్రవర్ణాలు ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడం సంచలనం సృష్టించిందని మాజీ ఎమ్మెల్యే ఆవేనద వ్యక్తం చేశారు. ఇలాంటి హత్యలు పునరావృత్తంగాకుండా ఎమ్మెల్యే చూడాల్సిన బాధ్యతెంతైనా ఉందన్నారు. పదవుల కోసం కూటమి నాయకులు పాకులాడుతున్నారని, అయితే పదవుల పేరుతో ప్రజలను ఇబ్బందులపాలు చేయవద్దని సూచించారు.

పట్టుబడిన వాహనాల వేలం


వేలం నిర్వహిస్తున్న సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్

కోసిగి: కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు బుధవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆవరణలో సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. సెబ్ సీఐ మహబూబ్ బాషా సమక్షంలో 12 వాహనాలకు వేలం వేయగా 9 వాహనాలను పాటదారులు కొనుగోలు చేశారు. ఇందులో ప్రభుత్వం రూ.1,13,400 ధర నిర్ణయించగా రూ.2,17,700కు కొనుగోలు చేశారు. ఇందుకు అదనంగా జీఎస్టీ రూ.39,186 లతో రూ.2,56,886 నగదు వచ్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. సెబ్ ఎస్ఐ రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలోని పీకల బెట్ట గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. బుధవారం పెద్దకడబూరు మండలంలో పీకలబెట్ట గ్రామ సమీపంలో పెద్దతుంబళంకు చెందిన సి.నాగరాజు, డి. వీరేష్ రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారివద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యుత్ ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన హరిజన హుసేని అనే బాలుడు ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై కర్నూలు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి, ఈఈ రాజేష్, ఏడీ పురుషోత్తం, ఆదోని రూరల్ ఏఈ చెన్నయ్యలు బుధవారం కర్నూలులోని ఆస్పత్రికి వెళ్లి బాలుడిని, తల్లిదండ్రులను పరామర్శించారు. విద్యుత్‌శాఖ అధికారులు తమ వంతుగా రూ.60 వేలు పోగుచేసి అందించారు.

మానసిక సంఘర్షణకు గురికావొద్దు


అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ సౌమ్య

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ మానసిక సంఘర్షణకు గురికాకుండా చూసుకోవాలని కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ సౌమ్య సూచించారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన మానసిక వికాసం–ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. మానసిక అనారోగ్యం వ్యాధి నిరోధక శక్తిని క్షీణింపజేస్తుందని చెప్పారు. మంచి ఆహారంతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్ రెడ్డి, ఈరమ్మ, ఉమాదేవి, సంతోష్, జోనాథన్ విక్లీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

ఆదోని సెంట్రల్: పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, జిల్లా నాయకులు సురేంద్ర, డివిజన్ నాయకులు శివ పిలుపునిచ్చారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు చెపట్టే అందోళన కార్యక్రమాలపై బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న విద్యారంగంలో నెలకొన్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. విద్యారంగాన్ని పటిష్ట పరుస్తామని అధికారంలోకి రాక ముందు గొప్పలు చెప్పి, అధికారం వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. కార్యక్రమములో పీడీఎస్‌యూ నాయకులు వీర ప్రతాప్, శ్రావణి, నిఖిత, ఆది, గోవిందు, ఎస్‌వైఎస్ నాయకులు వీరేష్, ఉపేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఆయకట్టుకు నీరు అందిస్తాం


ఎల్ఎల్‌సీ నీటికి గంగపూజ నిర్వహిస్తున్న ఇరిగేషన్ జేఈ రంగస్వామి, సిబ్బంది

పెద్దకడబూరు : ఎల్ఎల్‌సీ కింద ఉన్న ఆయకట్టు భూములకు త్వరలోనే సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ జేఈ రంగస్వామి తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదల అయిన నీరు బుధవారం పెద్దకడబూరు మండల పరిధిలోని 290/650కిలో మీర్ల రాయిని చేరుకున్నాయి. జేఈ రంగస్వామి తన సిబ్బందితో కలసి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతానికి ఈ కాలువ నీటిని తాగడానికి వాడుకోవాలన్నారు. వారం రోజుల్లో సాగుకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఓబులేసు, ఖాజా, గులామ్, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ చైర్మన్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి.బషీర్‌అహమ్మద్ 4వ వర్ధంతిని బుధవారం పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మదరసా విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్ అహమ్మద్, హాజీ వహబ్, యుకే రాజశేఖర్, షబ్బీర్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ఆకలి తీర్చండి


సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీలో ఉన్న కేజీబీవీ పాఠశాల విద్యార్థినుల ఆకలి తీర్చాలని ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశారు. పాఠశాలలో వంట నిర్వాహకుల మధ్య వివాదం కారణంగా వారం రోజులుగా సరిగా వంట వండకపోవడంతో విద్యార్థులు భోజనానికి, అల్పాహానికి ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వారు పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సమస్యపై పాఠశాల ప్రిన్సిపాల్ కవితను వివరణ కోరగా అల్పాహారం, భోజనం వండే విషయంలో వంటవారి మధ్య గొడవ జరిగడంతో సమస్య వచ్చిందని, విషయాన్ని జీసీడీఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యార్థినుల భోజనానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

5న రిక్రియేషన్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ జనరల్ బాడీ సమావేశాన్ని ఆగస్టు 5న నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి కేఆర్ రాఘవరెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల మృతి చెందిన క్లబ్ అధ్యక్షుడు వై.దేవేంద్రగౌడ్‌కు సమావేశంలో నివాళులర్పిస్తామన్నారు. క్లబ్ నూతన కమిటీని కూడా ఎన్నుకుంటామన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్

కోసిగి: పదో తరగతిలో మంచి మార్కులతో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి, కోసిగి మండల ప్రత్యేకాధికారి శామ్యూల్ సూచించారు. బుధవారం కోసిగిలోని కస్తూరీబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా 10వ తరగతి గదిలో వెళ్లి విద్యార్థినులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠ్యంశాలు బాగా బోధిస్తున్నారా, భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారని అని అడిగి తెలుసుకున్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలు వచ్చాయా అని అని అడిగారు. కొందరు విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదని సమాధానమిచ్చారు. రెండు రోజుల్లోగా వచ్చేలా చూడాలని ఎంఈఓ–1 మెయినుద్దీన్, ఎంఈఓ–2 నాగేశప్పలను ఆదేశించారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయించాలని ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీకి సూచించారు. ప్రవేట్ పాఠశాల యాన మాన్యం అధిక ఫీజులు వసూళ్ల అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈఓలు స్పందించడం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న, జిల్లా సహాయక కార్యదర్శి వీరేషులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. ప్రవేట్ పాఠశాలల పై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు.


ఎమ్మిగనూరు బాలికల హైస్కూల్‌లో తొక్కుడు బిళ్ల ఆడుతున్న విద్యార్థినులు


జంపాపురం పాఠశాలలో తాడులాగుడు ఆటలో పాల్గొన్న విద్యార్థినులు

క్రీడలతో మానసికోల్లాసం

కోసిగి: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని హెచ్ఎం అరుణ, పీడీ రామచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామీణ ఆటలలో భాగంగా తొక్కుడు బిల్ల, కర్రవిల్ల, ఏడు రాళ్ల లగోరి, కచ్చకాయలు, చెమ్మచెక్క, ముక్కుగిల్లుట, గోళీలు, బొంగరాలు, కాలిచెండు, అష్టా–చెమ్మా, దుంకుడు, పులి మేక ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంఎస్ బాలికల హైస్కూల్‌లో బాలికలకు పలు పోటీలను నిర్వహించారు. హెచ్ఎం కృష్ణమూర్తి, పీడీలు సుజన, నాగేశ్వరి పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపాల్, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జోబిఫిలిప్

గోనెగండ్ల : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, ఐక్యత అలవడుతుందని ఎన్‌సీసీ –9 ఆంధ్రగరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబిఫిలిప్ అన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థినులకు ఎన్‌సీసీ– ఏ సర్టిఫికేట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కమాండింగ్ ఆఫీసర్ హాజరై ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్‌తో కలిసి విద్యా ర్థినులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న వై గిరిజమ్మ

మంత్రాలయం : ప్రజా సమస్యలపై మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ఎంపీపీ వై.గిరిజమ్మ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీటి ట్యాంకులు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీటీసీ గోవిందమ్మ, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.